క్లుప్తంగా

తోడపెద్దుకు పెద్దకర్మ



నమస్కరిస్తున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

ఏయూక్యాంపస్: స్థానిక శివాజిపాలెంలో బుద్దల చిన్నయ్య సేవగరిడి ఎద్దు(తోడపెద్దు) ఇటీవల అకాల మరణం చెందింది. గురువారం నిర్వహించిన పెద్దకర్మ కార్యక్రమంలో ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ హాజరయ్యారు. అనంతరం స్థానిక వార్డు సమస్యలను కార్పొరేటర్ మువ్వల లక్ష్మి ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు మువ్వల సురేష్, శివాజి పాలెం శ్రీకృష్ణ సేవా సంఘం సభ్యులు, గ్రామ సేవా సంఘం సభ్యులు, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

కరాటే విజేతలకు అభినందన



కరాటే విజేతలను అభినందిస్తున్న మేయర్ హరి వెంకటకుమారి

ఆరిలోవ: ఆరిలోవలో కరాటే విజేతలను మేయర్ గొలగాని హరివెంకటకుమారి అభినందించారు. నవంబరు 24 నుంచి 26 వరకు పోర్టు స్టేడియంలో జరిగిన అంతర్జాతీయ వడకాయ్ కరాటే పోటీల్లో ఆరిలోవ బాబా స్పోర్ట్స్ అకాడమీకి చెందిన ఏడుగురు చిన్నారులు పతకాలు సాధించారు. వారిలో అండర్–49 కేజీల కుమిటీ విభాగంలో ఎస్.కె.ఫరూక్, అండర్–11 కాటా విభాగంలో మహ్మద్ గౌస్ ఉస్మాన్ స్వర్ణ పతకాలు సాధించారు. ముగ్గురికి రజితం, మరో ఇద్దరు కాంస్య పతకాలతో మెరిశారు. ఈ మేరకు విజేతలను గురువారం పెదగదిలిలో మేయర్ క్యాంప్ కార్యాలయంలో ఆమె అభినందించారు. కార్యక్రమంలో కరాటే కోచ్‌లు షేక్ అలీ, ఈశ్వర్, ఖాజా, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వీసీ సమతకు శుభాకాంక్షలు



ఆచార్య సమతను అభినందిస్తున్న జీఎఫ్ఏ సభ్యులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వీసీగా నియమితులైన ఆచార్య కె.సమతను గెస్ట్ ఫ్యాకల్టీ అసోసియేషన్ సభ్యులు గురువారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తమ సమస్యలను ఆమె దృష్టికి తీసకువెళ్లారు. తమను పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు సురేష్ మీసన్, డాక్టర్ ప్రసాద్, డాక్టర్ పద్మజ, డాక్టర్ దాస్, డాక్టర్ నాయుడు, డాక్టర్ దేవానంద్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు శిక్షణ

ఆరిలోవ: ఆరిలోవ ప్రాంతం తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం స్కూల్ కాంప్లెక్స్ శిక్షణ కార్యక్రమం జరిగింది. తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అడివివరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరిధిలో ఉన్న ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు ఈ శిక్షణలో పాల్గొన్నారు. డిప్యూటీ డీఈవో గౌరీశంకర్ పర్యవేక్షణలో జరిగిన ఈ శిక్షణలో చినగదిలి మండలం ఎంఈవో–2 అనురాధ ఇక్కడ ఉపాధ్యాయులకు బోధనలో మెలకువలు వివరించారు. పిల్లల్లో అభ్యసన సామర్థ్యాలు ఎలా పెంచాలో తెలియజేశారు. తరగతి గదిలో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి రికార్డులు నిర్వహించాలన్నారు. ఆ రికార్డులను జాగ్రత్తగా భద్రపరచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, రిసోర్స్ పర్సన్లు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

రైతుబజార్ కల సాకారం..!



రైతు బజార్‌లో ఈవో కార్యాలయం, స్టోర్ రూం, ఆర్వో ప్లాంట్ గదులు



ఆరిలోవలో తుది దశకు రైతుబజార్ నిర్మాణం

తూర్పు నియోజకవర్గంలో రైతుబజార్ల ఆధునికీకరణ, ఏర్పాటు పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఇప్పటికే ఉన్న ఎంవీపీ, పెదవాల్తేరు రైతుబజార్లలో అభివృద్ధి పనులు చేపడుతుండగా.. కొత్తగా మూడో రైతుబజార్ ఆరిలోవ ప్రాంతంలో నిర్మాణంలో ఉంది. ఈ పనులు దాదాపు పూర్తి కావొచ్చాయి. ఈ రైతుబజార్ అందుబాటులోకి వస్తే ఆరిలోవవాసుల కల నెరవేరినట్టవుతుంది.

- రూ.80 లక్షలతో ఆరిలోవ రైతుబజార్ నిర్మాణం
- రూ.18 లక్షలతో ఎంవీపీ రైతుబజార్ అభివృద్ధి
- రూ.9 లక్షలతో పెదవాల్తేరు రైతుబజార్ అభివృద్ధి

- ఆరిలోవ వాసులకు త్వరలో అందుబాటులోకి..
- తప్పనున్న కూరగాయల అవస్థలు
- పెదవాల్తేరు, ఎంవీపీ రైతుబజార్లలో అభివృద్ధి పనులు



ఇది కదా అభివృద్ధి

ఆరిలోవ: రైతుబజార్ కోసం ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న ఆరిలోవవాసుల కల సాకారమైన వేళ దగ్గరలోనే ఉంది. ఆరిలోవ ప్రాంతంలో తోటగరువు దరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెనక రెవెన్యూకు చెందిన అరెకరం స్థలంలో మార్కెటింగ్ శాఖ అధికారులు కొత్త రైతుబజార్‌ను నిర్మిస్తున్నారు. ఇందు కోసం రూ.80 లక్షల నిధులు కేటాయించారు. ఈ పనులు సుమారు 90 శాతానికి పైగా పూర్తయ్యాయి. రైతులు, డ్వాక్రా మహిళలు కూరగాయలు, ఆకుకూరలు విక్రయించడానికి 38 స్టాళ్లు, వ్యాపారుల కోసం 5 కిరాణ షాపులతో పాటు ఈవో కార్యాలయం, స్టోర్ రూం, వాచ్‌మన్ గది, పురుషులు, స్త్రీలకు వేర్వేరుగా మరగుదొడ్లు, ఆర్వో ప్లాంట్ కోసం ప్రత్యేక గది నిర్మించారు. ఇంకా పార్కింగ్ పనులు మాత్రమే పూర్తి చేయాల్సి ఉంది. అధికారులు దీన్ని త్వరలో ప్రజల కోసం అందుబాటులోకి తీసుకురావాలని ప్రయత్నిస్తున్నారు.

- జీవీఎంసీ 10వ వార్డు నుంచి 13వ వార్డు పరిధిలో ఇందిరానగర్, డెయిరీఫారం, ఆదర్శనగర్, రవీంద్రనగర్, తోటగరువు, బాలాజీనగర్, టీవీసీ పాయింట్, దుర్గాబజార్, ఆరిలోవ కాలనీ, రామకృష్ణాపురం, కేంద్ర కారాగారం, శ్రీకృష్ణాపురం, పైనాపిల్ కాలనీతో పాటు కొండవాలు ప్రాంతాలైన హనుమంతవాక, పెదగదిలి, చినగదిలి, దీన్‌దయాల్‌పురం వరకు లక్షకు పైగా జనాభా నివసిస్తున్నారు. వీరందరికీ ఇక్కడ కొత్తగా నిర్మిస్తున్న రైతుబజార్ అందుబాటులోకి రానుంది.

ఎంవీపీ రైతుబజార్‌లో మరమ్మతులు



ఎంవీపీ రైతుబజార్‌లో స్టాళ్లపై కొత్తగా వేసిన రేకులు

ఎంవీపీ రైతుబజార్‌లో మరమ్మతులు చేపట్టారు. ఇక్కడ స్టాళ్లపై ఉన్న రేకులు రంధ్రాలు పడి శిథిలమైపోయాయి. కొన్ని చోట్ల ఫ్లోరింగ్ దెబ్బతింది. సీసీ కెమెరాలు పనిచేయలేదు. విద్యుత్ దీపాలు వెలగడం లేదు. మార్కెటింగ్ శాఖ అధికారులు ప్రస్తుతం అవన్నీ బాగుచేసే పనిలో పడ్డారు. ఇందు కోసం సుమారు రూ.18 లక్షల నిధులు విడుదల చేశారు. పలు చోట్ల మరమ్మతులతో పాటు స్టాళ్లపై కొత్త రేకులు వేశారు. గోడలకు పెయింటింగ్, పాడైన చోట్ల ఫ్లోరింగ్ పనులు చేపట్టారు. ఇక్కడ వెలగని విద్యుత్ దీపాల స్థానంలో కొత్తవి అమర్చారు. పని చేయని సీసీ కెమెరాల స్థానంలో కూడా కొత్తవి ఏర్పాటు చేయనున్నారు.

దూరాభారం తప్పుతుంది



ఆరిలోవలో రైతుబజార్ ఏర్పాటు చేయాలని ప్రజలు ఎన్నో ఏళ్లుగా విజ్ఞప్తి చేస్తున్నారు. తోటగరువు వద్ద రైతుబజార్ నిర్మించడం చాలా సంతోషంగా ఉంది. ఇక్కడ రైతుబజార్ లేకపోవడంతో కూరగాయల కోసం ప్రస్తుతం సుమారు 5 నుంచి 6 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఎంవీపీ రైతుబజార్‌కు వెళ్లాల్సి వస్తుంది. కొత్త రైతుబజార్ అందుబాటులోకి వస్తే ఆరిలోవ ప్రాంతవాసులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

– జి.వెంకటశివ, డ్రైవర్స్ కాలనీ, ఆరిలోవ

పెదవాల్తేరులో మౌలిక వసతులకు ప్రాధాన్యం



నూతనంగా ఏర్పాటు చేసిన ఇనుప రేకుల షెడ్‌లు

ఏయూ క్యాంపస్: పెదవాల్తేరు రైతుబజార్‌ను రూ.9 లక్షల వ్యయంతో అభివృద్ధి చేస్తున్నారు. ఇప్పటికే రైతుల స్టాళ్ల పైకప్పునకు ఇనుప రేకులు అమర్చారు. గతంలో ఉన్న సిమెంట్ రేకులు విరిగిపోవడంతో వర్షాకాలంలో రైతులు ఇబ్బందులు పడేవారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ఎటువంటి ఇబ్బంది కలగకుండా పూర్తి స్థాయిలో స్టాళ్ల పైకప్పుపై ఇనుప రేకులు అమర్చారు.

మరుగుదొడ్లకు మరమ్మతులు

మరుగుదొడ్లకు అవసరమైన తలుపులు కొత్తగా ఏర్పాటు చేశారు. సాయంత్రం వేళలో వెలుగు కోసం ఎల్ఈడీ లైట్లు వేశారు. రైతుబజార్‌లో అవసరమైన ఎలక్ట్రికల్ మరమ్మతులు చేపడుతున్నారు. రైతుబజార్ ప్రాంగణంలో ఉన్న చిన్నపాటి గోతులను పూడ్చి ప్లాస్టింగ్ చేశారు. త్వరలో రైతుబజార్‌కు అవసరమైన పెయింటింగ్, సీసీ కెమెరాల ఏర్పాటు, సెప్టిక్ ట్యాంక్ మరమ్మతులు వంటివి చేయించడానికి ప్రతిపాదనలు పంపారు. త్వరలో వీటికి సంబంధించిన పనులు సైతం ప్రారంభమయ్యే అవకాశం ఉంది.



టాయిలెట్స్‌కి ఏర్పాటు చేసిన నూతన డోర్లు

రైతులకు అన్ని సౌకర్యాల కల్పన



రైతుబజార్‌లో రైతులకు అవసరమైన వసతులు కల్పించారు. షెడ్‌లు మార్పు చేయడం చాలా ఉపయుక్తం. అదే విధంగా మరుగుదొడ్లకు తలుపులు కొత్తవి ఏర్పాటు చేయడం, ఇతర సివిల్ వర్క్‌లు పూర్తి చేయడం చాలా బాగుంది.

– డి.మంజుల, పండ్ల వ్యాపారి

అవసరమైన పనులు చేపడుతున్నాం



రైతుబజార్‌లో ప్రభుత్వ నిధులతో రైతులకు ఉపయుక్తంగా అవసరమైన మరమ్మతులు, వసతుల కల్పన పూర్తి స్థాయిలో చేపడుతున్నాం. త్వరలో సీసీ కెమెరాల ఏర్పాటు, సెప్టిక్ ట్యాంక్ మరమ్మతులు, పెయింటింగ్ పనులు పూర్తి చేస్తాం. వీటికి సంబంధించిన ప్రతిపాదనలు పంపాం.

– కె.ఎం.ఎస్.వరలక్ష్మి, ఎస్టేట్ అధికారి

మరింత అభివృద్ధి చేయాలి



చినవాల్తేరు, పెదవాల్తేరు పరిసర ప్రాంతాల ప్రజలకు ఈ రైతుబజార్ ఎంతో అందుబాటులో ఉంది. పెద్ద సంఖ్యలో ఏయూ ఉద్యోగులు సైతం ఇక్కడ కొనుగోలు చేస్తారు. రైతుబజార్‌కు అవసరమైన సదుపాయాలు అభివృద్ధి చేయడం మంచి పరిణామం.

– సిహెచ్.సత్యనారాయణ, ఏయూ ఉద్యోగి

రూ.కోటితో రామాలయం అభివృద్ధి



పెదజాలరిపేట వాసులతో మాట్లాడుతున్న ఎంపీ ఎంవీవీ

ఎంవీపీ కాలనీ: పెదజాలరిపేటలో రూ.కోటితో ఆధునికీకరిస్తున్న రామాలయం, కల్యాణ మండపాల పనులను ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ పరిశీలించారు. గురువారం 19వ వార్డు పెదజాలరిపేటకు వెళ్లి స్థానికులతో కలిసి ఇటీవల ప్రారంభమైన పనుల పరిశీలించి పలు సూచనలు చేశారు. గ్రామస్తుల అభ్యర్థన మేరకు ఆధునికీకరణ పనులకు ఎంపీ ల్యాండ్స్ నిధులు మంజూరు చేశారు. కల్యాణ మండపంలో ఏసీల ఏర్పాటుతో పాటు ఫ్లోరింగ్ పనులు, భవనానికి రంగులు వేయనున్నారు. రామాలయంలో ఫ్లోరింగ్ ఆధునికీకరణతో పాటు విద్యుత్ సరఫరా పనులు చేపట్టనున్నారు. నిధులు మంజూరు చేసిన ఎంపీని స్థానికులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి సూరాడ వెంకటలక్ష్మి, స్థానిక నాయకులు పరసన్న, గణేష్, వసంత పాల్గొన్నారు.

రూ.20 లక్షలతో శివాలయం ఆధునికీకరణ

పెదజాలరిపేట పర్యటన అనంతరం ఎంపీ ఎంవీవీ 18వ వార్డు మూలపాలెంలోని శివాలయాన్ని సందర్శించారు. గతంలో స్థానికులకు ఇచ్చిన మాట మేరకు ఎంపీ ల్యాండ్స్‌లో భాగంగా స్థానిక శివాలయం అభివృద్ధికి రూ.20 లక్షలు కేటాయించారు. ప్రస్తుతం జరుగుతున్న పనులను ఎంపీ పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి పుక్కళ్ల ధనలక్ష్మి, పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పార్కుల ఆధునికీకరణ పనుల పరిశీలన

ఎంవీపీ కాలనీ: తూర్పు నియోజకవర్గ పరిధిలో ఆధునికీకరించిన పార్కులను జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ పరిశీలించారు. గురువారం ఉదయం శివాజీపాలెంలోని శివాజీ పార్కుతో పాటు ఎంవీపీ కాలనీ సెక్టార్–11లోని బృందావనం పార్కును సందర్శించారు. నగర ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేలా ఆయా పార్కులను అభివృద్ధి చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆధునికీకరణ పనులు దాదాపు పూర్తయ్యాయి. శివాజీ పార్కులో వాటర్ ఫౌంటేన్‌లు, వాకింగ్ ట్రాక్, చిల్డ్రన్ ప్లే ఏరియా, టాయిలెట్స్, ఓపెన్ జిమ్ తదితర సౌకర్యాలు మెరుగుపరిచిన తీరును పర్యవేక్షించారు. ఈ సందర్భంగా పలువురు వాకర్స్‌తో కమిషనర్ మాట్లాడారు. పార్కును పరిశుభ్రంగా ఉంచడంలో బాధ్యత తీసుకోవాలన్నారు. స్థానిక నివాసితుల సంఘం సభ్యులు పరిశుభ్రతను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. హౌస్ కీపింగ్, క్లీనింగ్ సక్రమంగా లేనందున పార్కు నిర్వహణకు ఎంత మంది సిబ్బంది అవసరమో తెలియజేయాలని హార్టికల్చర్ డిప్యూటీ డైరెక్టర్ దామోదర్‌కు కమిషనర్ సూచించారు.

- అనంతరం కమిషనర్ ఎంవీపీ కాలనీ సెక్టార్–11లో ఆధునికీకరించిన బృందావనం పార్కును సందర్శించారు. దశాబ్దాలుగా శిథిలావస్థలో ఉన్న ఈ పార్కును స్మార్ట్ థీమ్ పార్కుగా అధికారులు అభివృద్ధి చేసిన తీరును ప్రశంసించారు. గోడలకు కార్బన్ పెయింటింగ్ వేయాలని, ఎక్కువ నీడనిచ్చే మొక్కలు నాటాలని సూచించారు. పార్కును అందంగా తీర్చిదిద్దినందుకు కమిషనర్‌కు స్థానిక నివాస సంఘం ప్రతినిధులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జేడీస్ విజయలక్ష్మి, ఈఈ రత్నాకర్‌రెడ్డి, డీఈ సత్యనారాయణరాజు, డీఈ శ్రీనివాసరావు, ఏఎంహెచ్‌వో సత్యనారాయణ, ఏఈలు శిరీషా, సురేష్, పాల్గొన్నారు.



శివాజీ పార్కు సందర్శన సందర్భంగా వాకర్స్‌తో మాట్లాడుతున్న కమిషనర్ సాయికాంత్‌వర్మ



బృందావన్ పార్కులో సౌకర్యాలు పరిశీలిస్తున్న కమిషనర్ సాయికాంత్‌వర్మ, తదితరులు

ప్రజా సంక్షేమమే జగనన్న పాలన లక్ష్యం

- వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్త ఎంవీవీ
- ఉత్సాహంగా ఏపీకి జగనే ఎందుకు కావాలంటే..

ఎంవీపీ కాలనీ: ప్రజా సంక్షేమమే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన లక్ష్యమని విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. 19వ వార్డు వాసవానిపాలెం, శివగణేష్ నగర్‌లో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. తొలుత పార్టీ ముఖ్య నాయకులతో కలిసి వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో ఎంవీవీ మాట్లాడుతూ నాలుగున్నరేళ్లలో పేదలకు సంక్షేమాన్ని, అభివృద్ధిని చేరువ చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. జగన్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఆనందంగా ఉన్నారన్నారు. మత్స్యకారుల ఏ ప్రభుత్వం కల్పించనంత భరోసా జగన్ కల్పించారన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్ జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవడం ఎంతైనా అవసరమన్నారు. ఆ దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ వార్డు ఇన్‌చార్జి సూరాడ వెంకటలక్ష్మి, సూరాడ దాసు, పరసన్న, గణేష్, వసంత, తదితరులు పాల్గొన్నారు.

ఆరిలోవ: పేదలకు సంక్షేమ ఫలాలు అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రానికి మళ్లీ అవసరమని ఎంపీ ఎంవీవీ అన్నారు. జీవీఎంసీ 13వ వార్డులో గురువారం 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమం జరిగింది. కార్పొరేటర్ కెల్ల సునీతతో కలసి సచివాలయం 9 పరిధి శివాజీనగర్–2లో పార్టీ జెండా, సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎంవీవీ మాట్లాడుతూ ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తూర్పు నియోజకవర్గం ఎన్నికల పరిశీలకుడు మొల్లి అప్పారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు కెల్ల సత్యనారాయణ, పోలరావు, విక్టర్, ఎస్.కె.బేబీ, అనిల్, వరలక్ష్మి, శిరీషా, సచివాలయం కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.



19వ వార్డులో మాట్లాడుతున్న ఎంపీ ఎంవీవీ



21వ వార్డులో మాట్లాడుతున్న ఎంపీ ఎంవీవీ

పేదల ఆర్థిక ప్రగతే ధ్యేయం

మద్దిలపాలెం : పేదల ఆర్థిక ప్రగతే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగించి ప్రజల హృదయాలలో సుస్థిరమైన స్థానాన్ని ఏర్పచుకున్నారని ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు జగన్ ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని గురువారం 16వ వార్డులో అంబేడ్కర్ కాలనీలో స్థానిక కార్పొరేటర్ మొల్లి లక్ష్మి, ఏపీఐఐసీ డైరెక్టర్ మొల్లి అప్పారావు ఆధ్వర్యంలో సన్మానం చేశారు. ముందుగా పార్టీ పతకాన్ని ఎంపీ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వార్డు నాయకులు సచివాలయ కన్వీనర్లు ,ఒమ్మి పోలరత్నం, ఇప్పిలి పార్వతీ, చొల్లంగి నాగేశ్వరరావు, సంధ్యా, గృహ సారథులు, కస్టర్ల కన్వీనర్లు పాల్గొన్నారు.



16వ వార్డు అంబేడ్కర్ కాలనీ సభలో మాట్లాడుతున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

బీచ్ రోడ్డు: కుల, మతం, పార్టీలతో సంబంధం లేకుండా అర్హులందరికి సంక్షేమ ఫలాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. జీవీఎంసీ 21వ వార్డులో ఏపీకి జగనే ఎందుకు రావాలంటే భాగంగా వివిధ పథకాలతో కూడిన డిజిటల్ బోర్డులను సచివాలయాల్లో ఆవిష్కరించారు. అర్హులైనందరకీ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జి మధుపాడ రవికుమార్, వార్డు పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

మద్దిలపాలెం: రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ కలెక్టర్ రామ్మోహనరావు అన్నారు. మద్దిలపాలెం డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ యామిని, జాతీయ సేవా పథకం అధికారి డాక్టర్ పోలా ఉమామహేశ్వరరావు, జి.వి.ప్రతాప్, బి.లక్ష్మి పాల్గొన్నారు.



ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ కలెక్టర్ రామ్మోహనరావు

8 నుంచి మానవ హక్కులపై అవగాహన

ఎంవీపీ కాలనీ: బీవీ ఫౌండేషన్ ఫర్ పీస్ అండ్ హార్మోనీ, ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ రిలీజియస్ ఫ్రీడం సంస్థల ఆధ్వర్యంలో ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు మానవ హక్కులపై అవగాహన సమావేశాలు నిర్వహించనున్నారు.

ఈ వాల్‌పోస్టర్‌ను ఎంవీపీ కాలనీలోని వీఎంసీ కళాశాలలో గురువారం జరిగిన కార్యక్రమంలో సంస్థ చైర్మన్ నరవ ప్రకాశరావు, కళాశాల ప్రిన్సిపాల్ జగదీశ్వరరావు, తదితరులు ఆవిష్కరించారు. నగరంలోని డాక్టర్ ఎల్‌బీ కళాశాల ప్రాంగణంలో ఈ సమావేశాలు జరుగుతాయన్నారు.

32 వాహనాలకు వీల్ లాక్

బీచ్ రోడ్డు: బస్టాపుల్లో, రోడ్డుపై నో పార్కింగ్ ప్రాంతాల్లో నిలిపిన 32 వాహనాలకు వీల్‌లాక్ వేసినట్లు త్రీటౌన్ ట్రాఫిక్ సీఐ అమ్మినాయుడు తెలిపారు. త్రీటౌన్ పరిధిలో పలు ప్రాంతాల్లో వాహనాలకు వీల్ లాక్‌లు వేసి, వాహన చోదకులకు అవగాహన కల్పించారు. ఇకపై బస్టాపుల్లో, నో పార్కింగ్ ప్రాంతాల్లో వాహనాలు నిలిపితే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

అబ్బురం.. మహాకాళీ నృత్యరూపకం

మద్దిలపాలెం : విశాఖ మ్యూజిక్ అకాడమీ 54వ వార్షికోత్సవంలో భాగంగా గురువారం ప్రదర్శించిన మహాకాళీ నృత్యరూపకం ఆకట్టుకుంది. హైదరాబాద్‌కు చెందిన జొన్నలగడ్డ అనురాధ బృందం మహాకాళీ నృత్య రూపకాన్ని ప్రదర్శించారు. నృత్య రూపకంలో సన్నివేశాలను చక్కని నాట్య ముద్రికలతో పాటు ఆహా భావాలతో రక్తికట్టించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బి.రామబ్రహ్మం, వీఎంఏ ప్రతినిధులు రంగరాజన్, తదితరులు పాల్గొన్నారు.



మహాకాళీ నృత్యరూపకంలో సన్నివేశం